క్లుప్తంగా

96 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు సురేష్

మాకవరపాలెం: ఉచిత కంటి వైద్య శిబిరంలో 96 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో బుధవారం మండల కేంద్రంలోని మహిళా మార్ట్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న 96 మంది రోగులు హాజరయ్యారు. వీరికి కంటి వైద్య నిపుణుడు సురేష్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వీరిలో 63 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ తరలించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు శివమనోహర్, క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషిమాత అన్నదాన సత్రానికి విరాళం



అన్నదాన సత్రానికి అమ్మతల్లినాయుడుకు విరాళం అందజేస్తున్న శ్రీనాదు శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల శ్రీ సంతోషిమాత అన్నదాన సత్రం నిర్మాణానికి దాత భారీ విరాళం అందజేశారు. మాడుగుల గ్రామానికి చెందిన జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు, శ్రీనాదు శ్రీనివాసరావు రూ. 25వేలు నగదును సంతోషిమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడుకు బుధవారం అందజేశారు. దాతల సహకారంతో ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సత్రంలో ఎంతో మందికి అన్నదానం జరుగుతుందని అమ్మతల్లి నాయుడు అన్నారు. దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్‌గా రవిబాబు



దేవరాపల్లి: దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎ. రవి బాబు బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో పనిచేసిన రవిబాబు ఇటీవల బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపడతామన్నారు. మండలానికి చెందిన పలువురు రేషన్ డీలర్లు సీఎస్ డీటీ రవిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్‌ఎం ప్రసాదరావు బోధనా శైలి భేష్

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బి.వి.ఎస్.ఎస్. ప్రసాదరావు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అతనికి ఆయన స్థానంలో వచ్చిన హెచ్‌ఎం టి.వి.శేషగిరి, సహచర ఉపాధ్యాయులతో కలసి బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఉపాధ్యాయులు ప్రసాదరావు మాస్టారు బోధనా శైలి ఎంతో విశిష్టంగా ఉంటుందని, అతని బోధనాశైలి తాము కూడా పాటించి విద్యార్థుల్లో ఆశించిన ఫలితాలు తీసుకువస్తామని అన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలి



వీఆర్వోలు,సర్వేయర్లతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్

రావికమతం: గ్రామ స్థాయిలో రెవిన్యూ, సర్వేపరమైన సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్ , వీఆర్వోలు, సర్వేయర్లను ఆదేశించారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వీ అంబేద్కర్ బుధవారం వీఆర్వోలు, సర్వేయర్లుతో సమీక్ష జరిపారు. జీవో ఎంస్ నెంబర్ 30, రేషన్ కార్డులకు సంబంధించి వీఆర్వోల లాగిన్ నుంచి తహసీల్దారు పాస్‌వర్డ్‌కు చేరవేయడం, వీకేవైసీ చేయించడం, మ్యుటేషన్లు,నీటి తీరువా డిమాండ్ మేరకు వసూలు, పీజీఆర్ఎస్‌లో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో వచ్చిన దరఖాస్తులు వాటిపై విచారణ, కౌలుదారులకు కార్డులు మంజూర అంశాలపై చర్చించారు.

సినీ నటుడు జోగినాయుడుకు మాతృవియోగం

నాతవరం: ప్రముఖ సినీ నటుడు, మాజీ రాష్ట్ర క్రియేటివిటీ, కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు మాతృమూర్తి లోకవరపు సత్యవతి (70) తుది శ్వాస విడిచారు. కొద్దిరోజుల క్రితం ఆమె అనారోగ్యానికి గురయ్యారు. విశాఖలోని ఒక ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. మృతదేహాన్ని నాతవరం మండలంలోని చెర్లోపాలెం గ్రామానికి తరలించారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నువ్వు రైతులపై ప్రకృతి కన్నెర్ర

పంట చేతికందే వచ్చే సమయంలో వర్షాలకు నేలమట్టం

- మండలంలో 80 నుంచి 100 ఎకరాలకు పైగా దెబ్బతిన్న నువ్వుపంట
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



వర్షానికి నేలమట్టమైన పంటతో నువ్వుచేను



పొలాల్లో ధ్వంసమైన నువ్వు కంకులను దుఃఖంతో తొలగిస్తున్న రైతులు

నాతవరం: ప్రకృతి కన్నెర్ర చేయడం, మరోవైపు ప్రభుత్వం ఆదుకోకపోవడంతో నువ్వు రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నువ్వు పంట సాగు చేసే రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. ఈ ఏడాది మండలంలో 429 ఎకరాల్లో నువ్వు పంట రైతులు సాగు చేశారు. పంట చేతికందే వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో కళ్ల ముందే ఊహించని నష్టం జరగడంతో రైతులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఎంతో కష్టపడి పెట్టుబడి పెట్టి పండించిన నువ్వు పంట వర్షానికి పంట పొలాల్లో నీరు చేరి నువ్వు చేను కుళ్లిపోతుంది.

మండలంలో ఎక్కడ చూసినా నువ్వు చేనులో పంట కాపు దశలో ఉండడంతో చూసిన వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సగానికి పైగా నువ్వు పంటకోత దశకు చేరుకున్న తరుణంలో భారీ వర్షాలు సంభవించడంతో వర్షం ధాటికి పొలాల్లో పంట నేలమట్టం అయింది. గతంతో పోల్చుకుంటే నువ్వు పంట వేసిన దగ్గర్నుంచి వాతావరణం అనుకూలించడంతో అనుకున్న దానికి కంటే ముందుగా చేను ఏపుగా పెరిగి కాపు దశకు వచ్చేసింది. నువ్వులకు మార్కెట్లో రేటు బాగుడడంతో వచ్చిన డబ్బులతో ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేసుకునేందుకు పెట్టుబడి సాయం అందుతాయని రైతులు ఎంతో ఆశ పడ్డారు. రైతులు ఆశలన్నీ ప్రకృతి రూపంలో ఆడియాశలు కావడంతో రైతుల జీర్ణించుకోలేకపోతున్నారు. అసలే ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు రైతులకు పెట్టుబడి సాయంతో అందించలేదు. ప్రభుత్వం అదుకోక ప్రకృతి కన్నెర్ర చేయడంతో వ్యవసాయం సాగు చేసే రైతులకు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న నువ్వు చేనులు పంటను రైతులు పంట పొల్లాలో దాచుకోలేక బయటకు తరలించలేక ఏమి చేయాల్లో అర్థం కాక అయోమయంలో ఉన్నారు. పొల్లాలోంచి నీరు బయటకు తరలించాలంటే కూలీలకు యంత్రాలకు ఖర్చుతో కూడిన పని కావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం అందించి రైతులకు అదుకునేవారు కూటమి ప్రభుత్వం ఆ దిశగా రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేసిన దాఖలాలు లేవు.

చాలా బాధగా ఉంది...



ఎంతో కష్టపడి పెట్టుబడి పెట్టి పండించుకున్న నువ్వు చేను రెండు రోజుల్లో కోత కోసేందుకు సిద్ధం చేసుకున్నాం. పంట చేతి కందివచ్చే సమయంలో ప్రకృతి రైతులను ఆ విధంగా నష్టం కలిగించడం జీర్ణించుకోలేక పోతున్నాం. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకునే పరిస్థితులు కన్పించలేదు.

–రెడ్డి సత్యనారాయణ, ఏపీ పురం గ్రామం

నా దృష్టికి రైతులు తీసుకువచ్చారు..



నేను మంగళవారం గన్నవరం, మన్యపురట్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది.. కార్యక్రమం నిర్వహించేందుకు వెళ్లాను. ఆ గ్రామాల్లో రైతులంతా నువ్వు చేను వర్షానికి పూర్తిగా దెబ్బతింది. మీరు వచ్చి చూడండంటూ వాపోయారు. ఇంకా వర్షం పడితే పూర్తిగా చేను దెబ్బతింటుంది ఇంతటితో అగితే కాస్తా పర్వాలేదు.

– సుగుణ, వ్యవసాయాధికారి, నాతవరం మండలం

స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామునాయుడు

నర్సీపట్నం: స్మార్ట్ మీటర్ల బిగింపుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపడం ప్రభుత్వానికి తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పేర్కొన్నారు. పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను బిగించే విధానాన్ని నిరసిస్తూ ఈ నెల 5న పెదబొడ్డేపల్లి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ధర్నా చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో నాలుగుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. స్మార్ట్‌మీటర్లను బిగింపు విరమించుకోవాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

భూముల ఆన్‌లైన్‌కు వినతి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట జంగాలపల్లి రైతుల నిరసన

మాకవరపాలెం: భూములు ఆన్‌లైన్ చేయాలంటూ మండలంలోని జంగాలపల్లి రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ మేరకు అధిక సంఖ్యలో రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జీ.కోడూరు రెవెన్యూ ఉన్న సుమారు 500 ఎకరాల భూమిని చాలా కాలంగా ఆన్‌లైన్ చేయాలని కోరుతున్నా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామన్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కూడా సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ భూములను ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కోతుల బారి నుంచి రక్షించండి

- గాయాల పాలవుతున్న ప్రజలు
- స్పందించని అధికారులు, పాలకులు



కె.జె.పురంలో ఒక వీధిలో కోతులు సామూహం

మాడుగుల రూరల్: మేజర్ గ్రామ పంచాయితీ అయిన కె.జె.పురంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. పంట పొలాలల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. సీజన్‌లో చెరకు గడలు, అరటి, కొబ్బరి, మామిడి, కాయలును చెట్ల మీద నుంచి కొరికి పారివేస్తున్నాయి. వీటితో పాటు మొక్కజొన్న, కూరగాయల పంటలు పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. వానరమూకలు మాకుమ్మడిగా గ్రామాల్లో, పంట పొలాల్లో సంచరిస్తు ప్రజలను భయ బ్రాంతులుకు గురిచేస్తున్నాయి. పొలాల్లోకి మధ్యాహ్నం సమయంలో భోజనాలు తీసుకెళ్తున్న మహిళలు మీద వానరులు గుంపుగా దాడి చేసి, గాయపరుస్తున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. బొడ్డేడ సూర్యకుమారి అనే మహిళ మీద కోతులు దాడి చేసి గాయపరచడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంది. ఒంటరిగా వాహనాలు మీద ప్రయాణం సాగించే వారి మీద వానరాలు దాడులు చేస్తున్నాయి. ఈ విషయం గురించి మండల స్థాయిలో అధికారులకు ఎన్నో సార్లు వినతిపత్రాలు అందజేసినా సరే ప్రయోజనం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఘాట్ రోడ్డు, సాగరం, సురవరం, సాగరం కాలనీ, తాటిపర్తి, లో కోతులు ఎక్కువగా వుంది. తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలల్లో నిత్యం గోడల మీద తిరుగుతు విద్యార్థినులు, ఉపాధ్యాయులను నిత్యం భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటి బారి నుంచి కాపాడాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్టీసీ కాంప్లెక్సు



బురదమయంగా ఉన్న కృష్ణదేవిపేట ఆర్టీసీ కాంప్లెక్సు

గొలుగొండ: మన్యం ముఖద్వారం కృష్ణదేవిపేట బస్ షెల్టర్ బరదమయంగా మారింది. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాంప్లెక్సులోనికి వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్ షెల్టర్ నుంచి మన్యం అల్లూరి, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాకు నిత్యం ఆర్టీసీ సర్వీసులు వెళ్లడం జరుగుతుంది. కాంప్లెక్సులోనికి అడుగు పెట్టడానికి వీలు లేకుండా ఉండటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. గత ఏడాది బస్ షెల్టర్ వద్ద బురద లేకుండా స్థానిక సర్పంచ్ లోచల సుజాత చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ యాజమాన్యం బస్‌షెల్టర్ అభివృద్ధికి చర్యలు తీసుకోలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఆర్టీసీ కాంప్లెక్సు సంబంధించి సుమారుగా 15 వరకు షాపులు ఉన్నాయి. కాంప్లెక్సు అంతా అధ్వానంగా ఉండడంతో దుకాణాల వద్దకు ఎవరూ రాలేదని, దీని వల్ల అద్దెలు కట్టలేని పరిస్థితి వస్తుందని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వ్యాపారులు కోరుతున్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు అజయ్ శర్మ

నర్సీపట్నం: ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ పూర్వ ఉపాధ్యక్షుడు ఎం.అజయ్‌శర్మ పిలుపునిచ్చారు. ప్రసన్న అధ్యక్షతన జరిగిన సదస్సుకి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అజయ్ శర్మ మాట్లాడుతూ కనీసవేతనాలు అమలు కాక నిరుద్యోగం పెరిగి కార్మికులు, ప్రజల జీవన ప్రమాణాలు దిగజారిపోతున్నాయన్నారు. పిల్లల్లో పోషకాహారం లోపం అధికమైందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వివిధ రకాల పేరులతో ఉద్యోగ భద్రత కల్పించకుండా, పని గంటలు పెంచి కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులను దోచుకుంటున్నారన్నారు. కార్మికుల్లో ఐక్యత లేకుండా మత పరమైన విభజన సృష్టిస్తున్నారన్నారు.సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చట్టాలను కూడా తీసుకువచ్చిందన్నారు. రైతులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సమావేశంలో ఆశా రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి, జిల్లా ఉపాధ్యక్షుడు పి.వి.పరమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అమర్‌నాథ్

రావికమతం: పార్టీలో అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని చోడవరం సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రావికమతం తిరుమల కల్యాణమండపంలో రావికమతం మండల కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. మండలం నలుమూలల నుంచి వందలాది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరుకావడంతో పార్టీ కేడర్‌లో నూతనోత్తేజం వచ్చింది. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో దౌర్జన్యాలు పెచ్చుమీరిపోయాయన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులపై కూడా కూటమి నాయుకులు దౌర్జన్యాలకు దిగడం ప్రభుత్వ రాక్షస పాలనకు అద్దం పడుతోందని చెప్పారు. వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను స్థానిక ఎమ్మెల్యే మానసికంగా వేధించారని తెలిపారు. ఇటువంటి దౌర్జన్యాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాది పాలనలో వైఫల్యాలను తెలియజేసే కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్తలు అంకితభావంతో నిర్వహించాలన్నారు. కూటమి నేతలు ఎన్నికల ముందు త్రికరణ శుద్ధితో ఇచ్చిన అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు చెత్తబుట్టకే పరిమితం చేసిన మేనిఫెస్టోను 'రీకాల్ చంద్రబాబు మేనిఫేస్టో' పేరిట క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి కూటమి పార్టీల మోసాలు ప్రజలకు తెలియజేయాలని ఆయన తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అన్నీ ఇచ్చామని కూటమి నేతలు చెబుతున్నారు. ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నుంచి అంటున్నారు. ఏ సంవత్సరం నుంచి అమలు చేస్తారో తెలియని పరిస్థితిలో ప్రజలున్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా రూ.3 వేల భృతి ఎప్పుడిస్తారో తెలీదు, ఆడబిడ్డ నిధిని పీ–4కు లింక్ చేశామంటున్నారు. టీడీపీ ఎప్పుడూ ఒంటరిగా నిలబడి అధికారంలోని రాలేదని, అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేయడం అలవాటు అని అన్నారు. మండల నాయకులు అందరూ కలిసి కార్యకర్తలకు అండగా ఉండాలని, మన అందరికీ మన నేత జగన్ అండగా ఉంటారని, కార్యకర్తలు అందరూ సమష్టిగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఆన్నారు. అనంతరం అమర్‌ను పార్టీ కార్యకర్తలు పూలదండలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మి నాయుడు, ఎంపీపీ పైలా రాజు, పార్టీ కన్వీనర్ జగ్గారావు, ప్రోటోకాల్ జెడ్పీటీసీ తలారి ఆదిమూర్తి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, చోడవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ ఆసరి గోవిందరావు, మండల యూత్ అధ్యక్షుడు శీలం కల్యాణ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శీలం శంకర్, వైస్ ఎంపీపీ ముత్యా భవానీప్రసాద్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సన్యాసినాయుడు, మండల ఎంపీటీసీల ఫ్లోర్‌లీడర్ పూడి దేవా పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడు నారాయణమూర్తి సేవలు మరువలేనివి



రొంగలి నారాయణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: పెదనందిపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, మండల సీనియర్ నాయకుడిగా రొంగలి నారాయణమూర్తి అందించిన సేవలు మరువలేనివని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని పెదనందిపల్లి శివారు సత్యనారాయణపురం కాలనీలో రొంగలి నారాయణమూర్తి సంతాప సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నారాయణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక సర్పంచ్ సోమిరెడ్డి సన్నిబాబు, ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ, తదితర పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ రాజకీయ పార్టీల నాయుకులు నారాయణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడుగుల: ఈ నెల 4వ తేదీన మండలంలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎ.వి.ఎస్.ఎం అప్పారావు అన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోరారు.

రేపు రెండు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేత

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ సబ్‌స్టేషన్ పరిధిలో బోయలకింతాడ, వేచలం గ్రామాలకు శుక్రవారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు దేవరాపల్లి విద్యుత్ శాఖ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. విద్యుత్ లైన్లు మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

తుమ్మపాల: ఖరీఫ్‌లో రైతులందరూ ఆధునిక వ్యవసాయ యజమాని పద్ధతులు పాటించడం ద్వారా దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి పి.రంగారావు అన్నారు. తుమ్మపాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న రాయితీలు, పథకాలను అర్హులైన ప్రతి రైతుకు అందిస్తామని చెప్పారు. సేంద్రి య వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాల ని కోరా రు. ఆధునిక వ్యవసాయ యాంత్రిక పద్ధతులపై రైతు లందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లి పెసర, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలు ముందుగా వేసేకోవాలని తెలిపారు. వరి విత్తనాలను సుడోమోనోసతో శుద్ధి చేయడం ద్వారా తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుందని వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానశాస్త్ర వేత్త డాక్టర్ దాడి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వరి పండించే రైతులు యూరియా తగ్గించి పొటాష్ వంటి ఎరువులను వాడాలని సూచించారు. జీవన ఎరువుల వినియోగం వల్ల భూసారం పెరుగుతుందని చెప్పారు. వరి వేసే ప్రతి రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ (ఏటీఎంఏ) అధికారి పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన హెచ్‌ఎంకు వీడ్కోలు సత్కారం



బదిలీ అయిన హెచ్‌ఎం వీరాంజనేయులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సన్నిబాబును సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

కె.కోటపాడు: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు ఎస్.వీ రాంజనేయుల సేవలు స్ఫూర్తిదాయకమని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ అన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా పాచిలవానిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన వీరాంజనేయులు గుల్లేపల్లి పాఠశాలకు బదిలీపై వెళ్లారు. పాచిలవానిపాలెం గ్రామస్తులతో పాటు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ ఆధ్వర్యంలో హెచ్‌ఎం వీరాంజనేయులతో పాటు ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు వంటాకు సన్నిబాబుకు బుధవారం గ్రామంలో ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం వీరాంజనేయులు పాఠశాలను సొంత నగదుతో మరమ్మతులు చేయించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు తోడ్పడ్డారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల శివాజీరాజు కొనియాడారు. అనంతరం వీరాంజనేయులు, సన్నిబాబులను దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వార్డుమెంబర్ వంటాకు గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, వంటాకు దేముడుబాబు, పీవీపీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఏవోగా సుధాకర్



నర్సీపట్నం: నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఏవోగా బి.సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం ఏవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన గతంలో నక్కపల్లి ఆర్ఐగా, కొశింకోట మండలం తహసీల్దార్‌గా పని చేశారు. బాధ్యతలు చేపట్టిన ఏవో సుధాకర్‌నుకార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్లు వేయండి మహాప్రభో....



కొత్తకోట రోడ్డుపై గల గోతుల్లో మొక్కలు నాటుతూ నిరసన తెలియజేస్తున్న సీపీఎం సభ్యుడు గోవింద్ తదితరులు

రావికమతం: చోడవరం నుంచి నర్సీపట్నం వరకు బీఎన్‌రోడ్డును బాగు చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో కొత్తకోట పంచాయతీ కార్యాలయం ఎదురుగా గల రోడ్డుపై బుధవారం మొక్కలు నాటుతూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు మాట్లాడుతూ ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి ఉంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడం లేదన్నారు. రోడ్డు బాగో లేకపోవడం వల్ల విద్యార్థులు సకాలంలో స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని రోడ్డు పనులు పూర్తి చేయాలని , లేకపోతే ఈ నెల 9వ తేదీన జిల్లా పరిషత్ పాలకవర్గ సమావేశం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో భారీ ఎత్తున అందోళన చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిల్లో పొట్టి దొర, పులగా రమణాజీ, జోగిరాజు పాల్గొన్నారు.

వామనావతారంలో జగన్నాథస్వామి

చోడవరం: జగన్నాథస్వామి రథోత్సవాలులో భాగంగా, చోడవరంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కేశవస్వామి వారి దేవస్థానంలో ఉపాలయంలో కొలువైన జగన్నాథస్వామిని బుధవారం శ్రీ వామనావతారంగా అలంకరించారు. స్వామి వారిని భక్తులు ఉదయం నుంచి దర్శించుకున్నారు.

మాడుగులలో పరశురామావతారంలో...

మాడుగుల: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా జగన్నాథుడు బుధవారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని పరశురామావతారంలో ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారు నుండి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం మహిళల కోలాటాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఇంద్రజ్యుమ్నం మండపంలో హరి భజనలు చేశారు.